'టాస్క్ ఫోర్స్' లో వినాయక చవితి క్రికెట్ మ్యాచ్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా తిరుపతి కపిలతీర్థం వద్ద గల ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్ ఫోర్స్ (ఆర్ఎస్ఏఎస్టీఎఫ్) మైదానంలో శనివారం క్రికెట్ మ్యాచ్ పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ పోటీలలో పోలీస్ స్టేషన్ టీమ్, ఆపరేషన్ టీమ్, హెడ్ క్వార్టర్స్ టీమ్ లు పాల్గొన్నాయని నిర్వాహకులు తెలిపారు. ఫైనల్స్ కు హెడ్ క్వార్టర్స్ టీమ్, పోలీస్ స్టేషన్ టీమ్ లు చేరుకోగా 10 ఓవర్లకు గాను పోలీసు స్టేషన్ టీమ్ 93 పరుగులు చేయగా, హెడ్ క్వార్టర్స్ టీమ్ 90 పరుగులు మాత్రమే తీయగలిగిందన్నారు. మ్యాచ్ లో గెలుపొందిన పోలీసు స్టేషన్ టీమ్ కు టాస్క్ ఫోర్స్ ఎస్పీ పీ.శ్రీనివాస్ ట్రోఫీని అందించి అభినందించారన్నారు. మ్యాన్ ఆఫ్ ది సీరీస్ గా ఎంపికైన కానిస్టేబుల్ రాఘవకు షీల్డ్ అందజేసారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు వి.శ్రీనివాస రెడ్డి, ఎండీ షరీఫ్, ఏసీఎఫ్ జె.శ్రీనివాస్, ఆర్ఐ సాయిగిరిధర్, ఎస్ఐ రఫీ, ఆర్ఎస్ఐలు లింగాధర్, విష్ణువర్ధన్, వినోద్ కుమార్ పాల్గొన్నారు.

'సంతోష' సంద్రం...పరమసముద్రం

జలహారతి అనంతరం బహిరంగసభలో ప్రసంగిస్తూ...

"'కల' సాకారమైన వేళ
కన్నులపండువగా..
'జలహారతి'తో
పులకించిన 'పుడమి'
కుప్పానికి రెండేళ్లముందే
కృష్ణాపుష్కరాలు"

వినాయకుని వేడుకల్లో...

కృష్ణాజలాల్లో...లాహిరి లాహిరి లాహిరిలో..

'స్త్రీ శక్తి' బస్సులో...

చంద్రబాబు సమక్షంలో 6 ఎంఓయూలు



ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో, కుప్పం

ఎన్టీఆర్ కల సాకారమైన వేళ.. కన్నుల పండువగా జనం చంద్రబాబుకు నీరాజనం పలికారు.. పరమసముద్రం వద్ద హంద్రీనీవా బ్రాంచి కెనాల్ 'సంతోష'సంద్రమయ్యింది.. 'జలహారతులతో' పుడమి పులకించింది.. కుప్పానికి రెండేళ్లముందే కృష్ణా పుష్కరాలు వచ్చాయా? అన్నట్లుగా నియోజకవర్గ ప్రజలు సంబరాలు చేసుకున్నారు.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కుప్పం బ్రాంచి కెనాల్ వరకూ 'స్త్రీ శక్తి' బస్సులోనూ, బ్రాంచి కెనాల్‌లో బోట్‌లోనూ షికార్లు చేశారు.. స్థానిక ప్రజలతో మాటామంతీ కలిపి సూపర్‌సిక్స్ అమలు తీరుపై ఆరా తీశారు.. సంప్రదాయ పంచెకట్టులో జలవనరుల శాఖా మంత్రి నిమ్మల, ఎంఎల్‌సి శ్రీకాంత్‌తో కలిసి 'జలహారతి' నిర్విఘ్నంగా నిర్వహించారు.కర్నూలు జిల్లా మల్యాల ఎత్తిపోతల వద్ద ప్రారంభమైన హంద్రీనీవా 738 కిలోమీటర్లు ప్రయాణించి కుప్పం పరమసముద్రానికి 27 లిఫ్ట్ ఇరిగేషన్ల ద్వారా సాగు, తాగునీటిని తరలించారు. ఈ సందర్భంగానే జరిగిన బహిరంగసభలో ఆరు ఎంఒయులను చేసుకున్నారు. రాయలసీమను రత్నాల సీమగా అభివృద్ధి చేస్తామన్నారు. వచ్చే ఏడాది హంద్రీనీవా నీరు చిత్తూరుకు తరలించడమే తన లక్ష్యమని చంద్రబాబు ప్రకటించారు. కుప్పం బ్రాంచి కెనాల్ వద్ద ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ను పరిశీలించారు. రిజర్వాయర్లను, చెరువులను ఏ స్థాయిలో నింపామనే విషయాన్ని సిఎంకు మంత్రి, ఇరిగేషన్ అధికారులు వివరించారు. చంద్రబాబు జలహారతి సందర్భంగానే నియోజకవర్గ వ్యాప్తంగా 60 చోట్ల జలహారతి కార్యక్రమాలను టిడిపి శ్రేణులు నిర్వహించారు. హంద్రీనీవా విస్తరణ పనుల పైలాన్‌ను సిఎం ఆవిష్కరించారు. కుప్పంలో 3,908 కోట్ల పెట్టుబడులతో 12 పరిశ్రమలు వచ్చాయని, 15,600 మందికి ఉద్యోగాలు, 26,581 మందికి పరోక్ష ఉపాధి లభిస్తుందని చెప్పారు. 'ఐ-ఫోన్' ఛాసెస్ ఉత్పత్తి చేసేలా హిందాల్కో సంస్థ యూనిట్ ప్రారంభించనుందని వెల్లడించారు. ప్రపంచంలో ఉన్న టెక్నాలజీనంతా కుప్పానికి తెస్తానన్నారు.

ముఖ్యమంత్రికి సాదర వీడ్కోలు

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రెండు రోజుల జిల్లా పర్యటన ముగించుకుని బెంగళూరు తిరుగు ప్రయాణమయ్యారు. కుప్పం నియోజకవర్గంలో పలు అభివద్ధి కార్యక్రమాలలో పాల్గొన్న అనంతరం ముఖ్యమంత్రి శనివారం సాయంత్రం 5.45 గంటలకు పరమ సముద్రం వద్ద బహిరంగ సభ సమీపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక హెలికాప్టర్ లో బెంగళూరుకు బయలుదేరి వెళ్ళారు. తిరుగు ప్రయాణం అయిన ముఖ్యమంత్రి కి ఎం ఎల్ సి, విప్ కంచర్ల శ్రీకాంత్, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్ పి మణికంఠ చందోలు, జే సి జి.విద్యాధరి, కడా పిడి వికాస్ మర్మత్, ఆర్ టి సీ వైస్ చైర్మన్ ముని రత్నం నాయుడు, కుప్పం ఆర్ డి ఓ శ్రీనివాసులు వీడ్కోలు పలికారు.

గణపయ్యను దర్శించుకున్న చంద్రబాబు

కుప్పం పట్టణం ప్యాలెస్ రోడ్డులో శ్రీ మంజునాథ వినాయక సేవా సంఘం వారు ఏర్పాటు చేసిన రావణబ్రహ్మ రూపంలో ఉన్న గణనాథుని సీఎం చంద్రబాబు దర్శించుకున్నారు. కుప్పం మండలం పరమసముద్రం కష్ణా జలాలకు జల హారతి ఇచ్చేందుకు ఆర్టీసీ బస్సులో ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులతో వెళుతూ గణనాథుని సీఎం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీ మంజునాథ వినాయక సేవా సంఘం హర్ష ధర్మతేజ, కమిటీ సభ్యులు సీఎంకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నూతన దంపతులకు ఆశీర్వాదం



వినాయక పాఠశాల జ్యోతీశ్వర్ సోదరుడు సతీష్ దీపిక నూతన దంపతలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు, ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పి ఎస్ మునిరత్నం మరియు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, డాక్టర్ సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు సమక్షంలో ఆరు ఎంఒయులు ఇవే..

- కుప్పం పరిధిలో వ్యర్థాల నుంచి సంపద కార్యక్రమం అమలు కోసం ఎజిఎస్-ఐటిసితో ఒప్పందం. వ్యర్థాల సుస్థిర నిర్వహణపై ఇంటింటి ప్రచారం, పాఠశాలల్లో అవగాహనా కార్యక్రమాలను 15ఏళ్లపాటు నిర్వహించేలా ఒప్పందం.
- కుప్పంలో మహిళాపారిశ్రామికవేత్తలను తయారు చేయడం, మహిళాసంఘాలు తయారు చేసిన ఉత్పత్తులకు గ్రామీణ ప్రాంతాల్లో మార్కెటింగ్ అంశాలపై షీలీడ్స్ సంస్థతో ఒప్పందం.
- కుప్పంలో ఫైబర్‌బోర్డు ఉత్పత్తి కోసం కింగ్స్ వుడ్ డెకార్‌ప్రైవేట్ లిమిటెడ్‌తో ఒప్పందం. రూ.1100 కోట్ల పెట్టుబడితో మీడియం డెన్సిడీ ఫైబర్ బోర్డును ఉత్పత్తి చేయనున్న కింగ్స్ వుడ్ సంస్థతో ఒప్పందం. ఈ యూనిట్ ఏర్పాటుతో 2012 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలు.
- కుప్పంలో టు సీటర్‌ట్రైనింగ్ ఎయిర్ క్రాఫ్ట్ తయారీ యూనిట్ ఏర్పాటు చేసేందుకు ఒప్పందం చేసిన పయనీర్ క్లీన్ యాంప్స్ లిమిటెడ్ రూ.150 కోట్ల పెట్టుబడితో ఏడాదికి 70నుంచి 100 మందికి శిక్షణకు ఉపయోగించే టు సీటర్ విమానాలను తయారు చేయనున్న సంస్థ. మొత్తం 250 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగావకాశాలు లభించనున్నాయి.
- బెంగుళురుకు చెందిన స్పేస్ టెక్నాలజీ సంస్థ ఎత్రెయాల్ ఎక్స్ ప్లోరేషన్ గిల్డ్ సంస్థతో అవగాహనా ఒప్పందం. మీడియం లిఫ్ట్ లాంచింగ్ రాకెట్ రేజర్ క్రెస్ట్ ఎంకె-1 తయారీ ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం అవగాహనా ఒప్పందం చేసుకున్న ఎత్రెయాల్. రూ. 500 కోట్ల పెట్టుబడిని మూడు దశల్లో పెట్టేలా కార్యాచరణ, మొత్తం 500 మందికి ఉద్యోగ అవకాశాలు
- అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్ హబ్ ఏర్పాటు చేసేందుకు రెడ్ బెర్రీ ఫుడ్ లాజిస్టిక్స్ తో ఒప్పందం. రూ.300 కోట్ల పెట్టుబడితో 15 వేల మందికి ఉపాధి కల్పించేలా ప్రతిపాదన సమర్పించిన రెడ్ బెర్రి ఫుడ్ లాజిస్టిక్స్ సంస్థ. మామిడి, జామ, టమాటో పల్పింగ్ యూనిట్లను ఏర్పాటు చేయనున్న రెడ్ బెర్రీ ఫుడ్ లాజిస్టిక్స్.
- అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్ప్రెన్యూర్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఏలీప్) భాగస్వామ్యంతో కుప్పంలో అద్వితీయమైన గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కుకు సిఎం శంకుస్థాపన చేశారు. వంద కోట్ల పెట్టుబడులతో రెండువేల మందికి ఉపాధి లక్ష్యంగా ఈ పార్కును అభివృద్ధి చేయనున్నారు.

శెట్టిపల్లి భూ సమస్యను పరిష్కరించాలి : సిపిఎం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

శెట్టిపల్లి భూ సమస్యను పరిష్కరించాలని, బాధితులకు ప్లాట్లు కేటాయించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు యశోదానగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వందవాసి నాగరాజు మాట్లాడుతూ శెట్టిపల్లి ఇనాం గ్రామం కాబట్టి కొనుగోలుదారులకు, సాగుదారులకు భూమిపై పూర్తి హక్కు కావాలంటే నాటి ప్రభుత్వ పెద్దలు ల్యాండ్ పూలింగ్ చేయాలన్నారు. పైడిపల్లి గ్రామం లాగా ఉచితంగా క్రమబద్ధీకరించమంటే అంగీకరించలేదని, రైతుల వద్ద 70 శాతం, ప్లాట్లు దారుల వద్ద 50 శాతం భూమిని ఒత్తిడి చేసి బలవంతంగా 2019లో తెలుగుదేశం ప్రభుత్వం లాక్కున్నదని అన్నారు. సమస్య తీరిపోతే బాగుంటుందని భావించిన బాధితులు మనసు చంపుకుని అంగీకరించారన్నారు. 2019 వ

సంవత్సరంలో జీవో నెంబర్ 173 ను విడుదల చేశారు. వెంటనే ప్లాట్లు వేసి బాధితులకు కేటాయించకుండా ఎన్నికల సాకు చూపి మోసం చేశారని అన్నారు. తరువాత వచ్చిన ప్రభుత్వం లబ్ధిదారులను గుర్తించి, బాధితులు, సిపిఎం పార్టీ కలిసి పోరాడిన ఫలితంగా ప్రొసీడింగ్స్ ఇచ్చారు తప్ప ప్లాట్లు కేటాయించలేదు. తెలుగుదేశం కూటం ప్రభుత్వం నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా పోరాడి ప్లాట్లు సాధించుకుందామని సిపిఎం బాధితులకు విజ్ఞప్తి చేస్తున్నది. పోరాడితేనే సమస్యను పరిష్కరించుకో గలమని, బాధితులందరూ సిపిఎం చేస్తున్న పోరాటంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు టి సుబ్రహ్మణ్యం, కే వేణుగోపాల్, ఎన్ మాధవ్, పి బుజ్జి, పి రమేష్, ఏ రాధాకష్ణ, ఎం రాజు, ఎండి శ్రీనివాసులు, ఆవుల సురేష్, పి మునిరాజా, కెఆర్ఎస్ మన్యం, మోహన్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి బకాయిలు చెల్లించాలి : సిపిఎం

తిరుపతి టౌన్ :మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేసిన వ్యవసాయ కూలీలకు మూడు నెలల పైగా కూలి అందక, తిండికి ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు డిఆర్ఒ శ్రీనివాసరావుకు వినతిపత్రం ఇచ్చారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నేతృత్వం వహిస్తున్న గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు డబ్బులు చెల్లించలేని పరిస్థితి ఉందన్నారు. వెంటనే బకాయిలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఎన్.శ్రీనివాసులు పాల్గొన్నారు.

యువ రోగులకూ మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలు : డాక్టర్ జగదీష్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

'ఉద్యోగం చేయలేక ఇంటికే పరిమితం అయిన రోగుల జీవితాలను మార్చడంలో మోకాలి మార్పిడి ఆపరేషన్ కీలకం' అని బర్డ్ డైరెక్టర్ డాక్టర్ గుడారు జగదీష్ అన్నారు. శుక్రవారం నుంచి పుదుచ్చేరిలో మహాత్మాగాంధీ మెడికల్ కాలేజీలో దక్షిణాది రాష్ట్రాల ఆర్థోపెడిక్ అసోసియేషన్ 24వ వార్షిక సమావేశం జరిగింది. దేశవ్యాప్తంగా ప్రఖ్యాత ఆర్థోపెడిక్ సర్జన్లు, పరిశోధకులు, యువ వైద్య విద్యార్థులు పాల్గొన్నారు. ఆర్థోపెడిక్ రంగంలో తాజా ఆవిష్కరణలు, కొత్త చికిత్సా పద్ధతులు, అధునాతన శస్త్ర చికిత్సా సాంకేతికతలపై చర్చించారు. ఐదువేల మందికి పైగా సభ్యులున్న ఈ అసోసియేషన్ ఆహ్వానం మేరకు గుడారు జగదీష్ పాల్గొని ప్రసంగించారు. 'యువ రోగులకు మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సలు' అనే అంశంపై వివరించారు. 21 నుండి 45 సంవత్సరాల మధ్య వయసున్న రోగులకు దైనందిన కార్యకలాపాలకు ఆటంకం కలిగించే మోకాలి సమస్యల సందర్భాల్లో

మోకాలి మార్పిడి అవసరం అవుతుందని వివరించారు. చిన్న వయసులో ఇలాంటి శస్త్రచికిత్సలలో ఎదురయ్యే సవాళ్లు, ఆపరేషన్ అనంతర జీవిత నాణ్యతలో వచ్చే మార్పులను విశ్లేషించారు. ఈ శస్త్రచికిత్స విజయవంతం కావడానికి సర్జన్ నైపుణ్యం, ఆపరేషన్ సమయంలో తీసుకునే జాగ్రత్తలు, నాణ్యమైన ఇంప్లాంట్ల ఎంపిక ప్రధానమని ఆయన పేర్కొన్నారు. 1999లో బర్డ్ హాస్పిటల్‌లో 21 ఏళ్ల యువతికి చేసిన మోకాలి మార్పిడి శస్త్రచికిత్స ఉదాహరణను ఆయన గుర్తుచేశారు. 26 సంవత్సరాల తర్వాత కూడా ఆ మహిళ ఆరోగ్యవంతంగా, చురుకుగా జీవిస్తున్నారని వివరించారు. ఈ తరహా ఉదాహరణల ద్వారా సరైన ఆర్థోపెడిక్ చికిత్సలతో యువ రోగులు కూడా పూర్తిగా కోలుకుని ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపగలరని ఆయన స్పష్టం చేశారు. డాక్టర్ జగదీష్ ప్రసంగం యువ వైద్యులు, పరిశోధకులకు ఎంతో స్ఫూర్తినిచ్చేలా నిలిచింది. ఈ సమావేశం ఆర్థోపెడిక్ వైద్య రంగంలో కొత్త పరిశోధనలకు, మెరుగైన చికిత్సా విధానాలకు మార్గం సుగమం చేస్తుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

శేషాచలంలో పెద్దపులి గాండ్రింపు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

దాదాపు వందేళ్ల క్రితం తన గర్జనలతో శేషాచలం అటవీ ప్రాంతంలో కలియ తిరిగిన 'పెద్దపులి' ప్రస్తుతం వడివడిగా కర్నూలు వైపు నుండి శేషాచలం అడవుల వైపు అడుగులు వేస్తోంది. పెద్దపులి గాండ్రింపులు లేక ఇన్నేళ్లుగా బోసిపోయిన శేషాచలం అడవులు మళ్లీ ఆ గాండ్రింపులతో దద్దరిల్లనున్నాయి. పెద్దపులులు తమ గమనాన్ని కర్నూలు వైపు నుండి శేషాచలం అడవుల వైపు క్రమంగా మార్చుకుంటున్నాయి. కర్నూలు టైగర్ ఫారెస్ట్‌లో పులుల సంతతి క్రమేపి పెరుగుతుండడంతో గతంలోనే పులుల సంతతి పెరిగి శేషాచలం వైపు పెద్దపులి అడుగులేస్తుందని 'ప్రజాశక్తి' తన కథనాలలో నిస్పష్టంగా చెప్పింది. నల్లమల టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ నుండి శేషాచలం అడవుల వైపు పెద్దపులి ఆగమనం జరిగేటట్లు పరిస్థితులు అనుకూలించడంతో అన్నమయ్య జిల్లా చిట్వేలు అటవీ రేంజ్ పరిధిలో పెద్దపులి ప్రవేశించినట్లుగా అటవీ శాఖ అధికారులు దవీకరించారు. జాతీయ జంతువుగా గుర్తింపు పొందిన పెద్దపులి సంతతిని పెంచడానికి అటవీశాఖ అధికారులు కర్నూలు నాగార్జునసాగర్ వద్ద ఉన్న పెద్దపులుల అటవీ ప్రాంతాన్ని రాజీవ్ అభయారణ్యంగా ప్రకటించారు. పెద్ద పులులు విస్తరిస్తున్న వాటి సంతతికి తగ్గట్టు ఆవాసాలను ఏర్పాటు చేసుకోవడానికి అనువైన కొండ ప్రాంతాలు, దట్టమైన చెట్ల సమూహ ప్రాంతాలు శేషాచలం అడవులలో ఉండడంతో వడివడిగా పెద్ద పులులు శేషాచలం అడవుల వైపు వస్తున్నాయి.

చిట్వేలు అటవీ రేంజ్ లో పెద్దపులి చిత్రం నిక్షిప్తం....

శేషాచలం అటవీ పరిధి అన్నమయ్య జిల్లా

వందేళ్ల తరువాత కెమెరాలో రికార్డు
పెరుగుతున్న పెద్దపులుల సంతతి
వారసత్వ సంపదగా కెన్నెత్ అండర్సన్ బంగ్లా

చిట్వేలు అటవీ రేంజ్ లో అటవీ శాఖ ఏర్పాటు చేసిన ట్రాప్ కెమెరాల్లో పెద్దపులి తిరుగుతున్నట్లుగా ఫోటోల ద్వారా అధికారులు ధవీకరించారు. చిట్వేలు అటవీ ప్రాంతానికి వచ్చిందంటే దాదాపు శేషాచలం అడవులలోకి పెద్దపులులు ప్రవేశించినట్లుగానే చెప్పాలి. శ్రీశైలం టైగర్ రిజర్వ్ లో పెద్ద పులుల సంతతి పెరుగుతున్న నేపథ్యంలో శేషాచలం అడవులలోకి ఇక సహజంగా వచ్చి వెళుతుంటాయని అధికారులు అంచనా వేస్తున్నారు. పెద్దపులి అడవికి రక్షణగా ఉంటుందని అటవీ శాఖ అధికారులు భావిస్తున్నారు. విరివిగా పెరిగిన పచ్చదనం, దట్టమైన అడవి, ఎత్తైన కొండలు పెద్దపులుల ఆవాసాలకు అణువుగా ఉంటాయని, ఇలాంటి ప్రదేశాలను పెద్ద పులులు ఉండడానికి ఇష్టపడతాయని అధికారులు చెబుతున్నారు.

రేణిగుంట అటవీ ప్రాంతం వరకు.....

దాదాపు వందేళ్ళ క్రితం శేషాచలం అడవులలో తన గాండ్రింపులతో ఇక్కడి ప్రజలను భయకంపితులు చేసిన పెద్దపులి శేషాచలం అటవీ ప్రాంతంలోని మామండూరు, రేణిగుంట అటవీ ప్రాంతం వరకు సంచరించినట్లుగా అటవీశాఖ అధికారుల వద్ద సమాచారం ఉంది. అప్పట్లో మామండూరు, సెట్టిగుంట ప్రాంతాలలో పశువులు మేపుకునే వారిని, మరికొందరిని పెద్దపులి వేటాడి చంపుతున్న నేపథ్యంలో పెద్దపులి గమనాన్ని గమనించి, మ్యాన్ ఈటర్ గా మారిన పెద్దపులి నుండి రక్షించడానికి అప్పటి బ్రిటిష్ పాలకులు కెన్నెత్ అండర్సన్ అనే అధికారిని నియమించారు. ఆయన మామండూరు అటవీ ప్రాంతంలో పెద్ద పులుల గమనాన్ని గమనించడానికి 1920లో ఫారెస్ట్ బంగ్లాను వీక్షణకు అనుకూలంగా నిర్మించారు. ఇక్కడినుండే

మామండూరు అటవీ ప్రాంతంలో సంచరిస్తూ ప్రజల ప్రాణాలు బలిగొంటున్న పెద్దపులిని, దాని గమనాన్ని గుర్తించినట్లుగా అధికారులు తెలుపుతున్నారు. పెద్దపులి ద్వారా చనిపోయిన ఎన్నో ఘటనలను ఇప్పటికీ రికార్డు పరంగా నోటిపై చేయబడింది. పెద్దపులి దాడి చేస్తే ప్రాణాలు కాపాడడానికి అప్పట్లో రేణిగుంటకు తీసుకొచ్చినట్లుగాఆధారాలు ఉన్నాయి.

వారసత్వ సంపదగా కెన్నెత్ అండర్సన్ బంగ్లా....

వందేళ్ళ క్రితం శేషాచలం అటవీ పరిధి మామండూరు సెక్షన్ పరిధిలో పెద్దపులుల నుండి మానవాళిని రక్షించడానికి బ్రిటిష్ అధికారి నిర్మించుకున్న ఫారెస్ట్ బంగ్లాను ఆంధ్రప్రదేశ్ ఫారెస్ట్ విభాగానికి సంబంధించిన వారసత్వ సంపదగా గుర్తించాలని ఇప్పటికే జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ను కోరుతూ లేఖ ఇచ్చాం. మామండూరు అటవీ ప్రాంతాన్ని వీక్షించే వీక్షకులకు, ప్రకతి ప్రేమికులకు ఈ భవనం ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. కమ్యూనిటీ బేస్డ్ ఎకో టూరిజం ప్రాజెక్టు ద్వారా 105 ఏళ్లు గడిచిన ఈ ఫారెస్ట్ బంగ్లా ట్రెక్కర్స్ కు ప్రత్యేక అనుభూతిని కలిగిస్తుంది. మామండూరు అటవీ ప్రాంతాన్ని ఎకో టూరిజం కేంద్రంగా మార్చడానికి ఇటీవల అటవీ శాఖకు సంబంధించిన కీలక సమావేశాన్ని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ నిర్వహించారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి కార్యక్రమాలను మామండూరు ప్రాంతంలో చేయనున్నాం. **వివేక్, జిల్లా అటవీశాఖ అధికారి**



'ఒబెరాయ్'కి... ఒబ్బిడిగా..!

ప్రజాదృష్టి

ప్రజాశక్తి-తిరుపతి సిటి

కోట్ల రూపాయలు విలువ చేసే టిటిడి స్థలాన్ని అప్పనంగా కాజేశాడు ఓ ఘనుడు. అతను రాజకీయ నేతో, రౌడీషీటరోకాదు సుమా కోట్లకు పడుగలెత్తిన మిలియనీరు. దానికి సహకరించింది బూర్జువా రాజకీయ పార్టీలు. సాక్షాత్తు సిఎం పేషీ నుంచే కథ నడిపి, దాతత్వాన్ని చాటుకుని, దాతలు శ్రీవారికిచ్చిన భూమిని, అధికారం మాటున సేవా కార్యక్రమంలో భాగంగా ఒబెరాయ్‌కి అప్పనంగా ఒప్పందం పేరుతో అప్పగించారు. పైగా వాటాల కోసం అధికార, ప్రతిపక్షాలు ఇద్దరూ ఒకరిపై మరొకరు బురద జల్లుకోవడం గమనార్హం. దొందు దొందే అన్న రీతిలో వ్యవహరిస్తున్నారు.

తిరుమల కొండ ప్రపంచ ప్రసిద్ధిగాంచిన క్షేత్రం. ఈ క్షేత్రాన్ని స్వయంప్రతిపత్తిగల టిటిడి పర్యవేక్షిస్తోంది. శ్రీవారి ఆస్తులను పర్యవేక్షించడమే వీరి పని. దురదష్టవశాత్తు ఇటీవల బూర్జువా రాజకీయ పార్టీల నాయకుల కబంధహస్తాలలో టిటిడి నలుగుతోంది. ప్రతి రోజూ కోట్లాది రూపాయల ఆదాయం సమకూర్చే టిటిడిని, రాజకీయ నిరుద్యోగుల ఆశ్రయంగా మార్చేస్తున్నారని ప్రజలే బహిరంగంగా విమర్శలు చేస్తున్నారు. ఇటీవల విముర్శలు మరింత అధికమయ్యాయి. అందుకు ప్రధాన కారణం అలిపిరి సమీపంలోని టిటిడి ఇనాం భూములను ముంతాజ్ హోటల్ నిర్మాణానికి ఒబెరాయ్ సంస్థకు కేటాయించడం. కూటమి ఏర్పడిన తొలినాళ్లలోనే కల్తీనెయ్యి కలకలం, వైకుంఠ దర్శనాల టోకన్ల జారీ సందర్భంగా తొక్కిసలాట భక్తులు మతి, ఇప్పుడు తాజాగా ముంతాజ్ వ్యవహారం టిటిడిని రోడ్డుకీడ్చుతున్నాయి. ఈ భూకేటాయింపు వ్యవహారం ఇప్పటిదికాదు సుమా. 17 సంవత్సరాల క్రితంది. 2008లో టిటిడీ పబ్లిక్, ప్రయివేట్ పాట్నర్షప్ (పిపి) పేరుతో ఏపిటూరిజానికి, దేవలోక్ ప్రాజెక్టుకు అలిపిరి-ఎస్వీ జూపార్కు రోడ్డులో తిరుమల కొండకు ఆనుకుని ఉన్న 30.52 ఎకరాల స్థలాన్ని ఇవ్వాలని ఎంఓ చేసుకున్నారు. 2011లో ఇంటర్నేషనల్ బిల్డింగ్ ప్రాసెస్ ఎల్ఐ జీవో నెంబరు 65 ద్వారా. 2011, జూన్ 14న అధికారికంగా ఉత్తర్వులు ఇచ్చారు. 2013లో ఏపి టూరిజం, దేవలోక్ ప్రాజెక్టు అగ్రిమెంట్ జరిగింది. 2014లో దేవలోక్ ప్రాజెక్టుకు భూమిని అప్పగించారు. 2015లో ఎన్వరాల్మెంట్ క్లియరెన్స్ సమస్య రావడంతో ప్రాజెక్టు పనులు ఆలస్యమయ్యాయి. ఎట్టకేలకు 2021లో కేంద్ర ప్రభుత్వం స్పందించి, దీనికి క్లియరన్స్ ఇచ్చింది. దీంతో 2021, నవంబర్ 26న జీవో నెంబరు 24 ద్వారా 21 ఎకరాలు భూమిని ముంతాజ్ హొటల్కి కేటాయించారు. దీంతో పాటు మరో 5 ఎకరాల స్థలాన్ని మేడా మల్లికార్జున (ఎంఆర్ఆర్) కంపెనీకి సైతం కేటాయిచారు. అప్పట్లో హిందూ సంఘాల పేరుతో నిరసనలు సాగాయి. 2024 నవంబరు 18న నెం.102 కింద టీటీడీ పాలకమండలిలో చర్చించి దేవలోక్ కు, ముంతాజ్ హొటల్కు కేటాయించిన స్థలాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవాలని నిర్ణయించారు. 2025 మార్చి21న ఈ స్థలాన్ని స్వాధీనం విషయాన్ని ముఖ్యమంత్రి టేబుల్కు చేరింది. ముంతాజ్ హొటల్ యాజమాన్యంతో సుమారు రెండు గంటల పాటు చర్చించిన సీఎం దానికి బదులుగా అలిపిరికి మరింత చేరువలో, విలువైన స్థలాన్ని కేటాయించేందుకు అంగీకరించారు.

కథంతా కాసుల కోసమేనా..!

వాస్తవానికి ముంతాజ్ హొటల్కు స్థల కేటాయింపులో కోట్లాది రూపాయలు చేతులు మారాయన్నది. జగమెరిగిన సత్యం. ఈ భూముల కేటాయింపులకు సంబంధించి అప్పటి ప్రభుత్వం, టిటిడి పాకలమండలి పెద్దలు పెద్ద ఎత్తున లబ్దిపొందారన్నది కూటమి ప్రభుత్వ ఆరోపణ. కార్పొరేట్ శక్తుల వద్ద కోట్లాది రూపాయలు అప్పనంగా దండుకునేందుకే, అలిపిరికి దగ్గరగా ఉన్న కోట్లాది రూపాయలు విలువ చేసే టిటిడి భూమిని కేటాయిస్తున్నారని వైసిపి విమర్శలు గుప్పిస్తోంది. వారం రోజులుగా ఆటు టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడుపై మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, కరుణాకరరెడ్డిపై బిఆర్ నాయుడు విలేకర్ల సమావేశాలు పెట్టి మరీ దుమ్మెత్తి పోసుకుంటున్నారు. దీనికి తగుదునమ్మా అన్నట్లు ప్రస్తుత టీటీడీ పాలకమండలి సభ్యులు భానుప్రకాష్ రెడ్డి, మాజీ పాలకమండలి సభ్యులు ఓవి. రమణ ద్వారా కూడా వైసిపి పై విమర్శలు గుప్పించారు. తామేమి తక్కువ కాదన్నట్లు కరుణాకరరెడ్డి తమ అనుచర గణమైన పసుపులేటి సురేష్, శేఖర్రాయల్ తదితరులతో సవాల్లు ప్రతిసవాల్లు విసురుతూ విమర్శలు చేయించారు. ఇలా ముంతాజ్ హొటల్ భూ కేటాయింపు వ్యవహారం చర్చనీయాంశమైంది. ఎస్వీ జూపార్కు సమీపంలో కానీ, ఇటు అరవింద్ హాస్పిటల్ పక్క నున్న భూమి కాని రెండు టిటిడికి అంత్యంతన విలువైనవే. వీటిని కార్పొరేట్ శక్తులకు కట్టపెట్టాలనుకోవడం తప్పు. మీ వల్లే తప్పజరిగింది. ఆ తప్పును సరిదిద్దుతున్నాం అంటూ అధికార, ప్రతిపక్షం దూషణలకు దిగడం విడ్డూరం. వాస్తవానికి ఈ భూమి కేటాయింపు వ్యవహారం 2008వ సంవత్సరం వాటిది. అప్పటి ఉమ్మడి రాష్ట్ర సిఎం వైఎస్. రాజశేఖరరెడ్డి హాయాంలో ఈ నిర్ణయం జరిగింది. తర్వాత రోశయ్య, కిరణ్ క్కుమారెడ్డి ఇద్దరు ముఖ్యమంత్రులు పని చేశారు. రాష్ట్ర విభజన తర్వాత ఇదే టిడిపి ఐదేళ్లు అధికారంలో ఉంది. తర్వాత వైసిపి 2019లో అధికారంలోకి వచ్చింది. 2024లో తిరిగి జనసేన, టీడీపి, బిజెపి కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి రావడం జరిగింది. అప్పడెప్పుడో జరిగిన చర్చను ఇప్పుడు తను స్వలాభాల కోసం తెరపైకి తెచ్చి, తమ నిర్ణయం ప్రజాభిప్రాయం ఆనేలా అధికార, ప్రతిపక్షాలు వ్యవహరిస్తుండడం దారుణం. ఇప్పటికైనా ఇరు పక్షాలు ఆలోచించి, దాతలు శ్రీవారిపై భక్తితో ఇచ్చిన స్థలాలను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేసే విధానానికి సప్తి చెప్పాలని పలువురు ప్రజాస్వామ్యవాదులు కోరుతున్నారు.

శ్రీ కనుపూరు ముత్యాలమ్మ దేవస్థానం చైర్మన్‌కు వినాయక చిత్రపటం బహూకరణ

ప్రజాశక్తి - కోట: మండల పరిధిలోని సిద్దవరం పంచాయతీలో స్థానిక టిడిపి నాయకులు వినాయక చవితి పండుగ సందర్భంగా వినాయకుడి బొమ్మను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ కనుపూరు ముత్యాలమ్మ దేవస్థానం చైర్మన్ చిల్లకూరు దశరథ రామిరెడ్డి విచ్చేశారు. ఆయనను స్థానిక టిడిపి యువ నాయకులు ఇంగిలాల రామ్మోహన్, పిండి వెంకట కృష్ణయ్య, ఇంగిలాల రామయ్యలు ఆహ్వానించి వినాయక చిత్రపటాన్ని అందజేశారు. వినాయక చవితి ఉత్సవాన్ని ఘనంగా జరపడంతో చిల్లకూరు దశరథరామిరెడ్డి, సిద్దవరం టిడిపి నాయకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సిద్దవరం టిడిపి నాయకులు నాగరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముత్తింటి స్వాతికి డాక్టరేట్

ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ సంస్కృత విశ్వ విద్యాలయం, సాహిత్య విభాగం పరిశోధక విద్యార్థి ముత్తింటి స్వాతికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి డా.కె.సాంబశివ మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. సాహిత్య విభాగం ఆచార్యులు ప్రొఫెసర్ జె.బి.చక్రవర్తి మార్గదర్శకత్వంలో "చితానం సందేశ కావ్యానాం సాహిత్యిక మధ్యయనం" అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించారు. ప్రస్తుతం స్వాతి జిల్లా ప్రజా పరిషత్ హైస్కూల్ అప్పనవీడులో స్కూల్ అసిస్టెంట్ సంస్కృత అధ్యాపకురాలుగా పనిచేస్తూ ఉంది. ఈ సందర్భంగా డాక్టరేట్ అవార్డు పొందిన ఆమెకు రీసెర్చ్ గైడ్ ప్రొ.జె.బి చక్రవర్తి, సాహిత్య విభాగం అధ్యాపకులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

మోహన్‌కు ఆగమశాస్త్రంలో డాక్టరేట్

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం కె.మోహన్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి సాంబశివరావు ఒక ప్రకటనలో తెలి పారు. ఆగమ విభాగంలో ప్రొఫెసర్ దర్శన డీన్ వేదాంతం శ్రీవిష్ణుభట్టాచార్యులు మార్గ దర్శకత్వంలో "భృగుప్రోక్తస్య యజ్ఞాధికారస్య వైఖానసగ్రంధాన్నైః సహ తులనాత్మకమధ్యయనం" అను అంశంపై పరిశోధన గ్రంథాన్ని వర్సిటీ సమర్పించగా పరిశీలించిన విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. మోహన్ కంచి కామకోటి పీఠాధిపతుల పర్యవేక్షణలో ఆదిచుంచనగిరి గల ఆగమ పాఠశాలలో అధ్యాపకుడిగా పని చేస్తున్నారు. ఈ సందర్భంగా వీరిని పలువురు అభినందించారు.

చాందినికి డాక్టరేట్

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం బిజినెస్ మేనేజ్‌మెంట్ పరిశోధన విద్యార్థిని ఎం.చాందినికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య ఉషారాణి తెలిపారు. ఈమె ఆచార్య జె. కాత్యాయని మార్గదర్శకత్వంలో 'యాన్ ఇంటెలిజెంట్ టూరిజం ఇన్ఫర్మేషన్ సిస్టమ్' అంశంపై పరిశోధన గ్రంథం సమర్పించారు. ఇందుకుగాను పరిశోధన విద్యార్థిని చాందినికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వెల్లడించారు. చాందిని కి డాక్టరేట్ రావడం పట్ల పలువురు ఆచార్యులు, పరిశోధకులు, కుటుంబ సభ్యులు అభినందనలు తెలిపారు.

వాకాడు తహశీల్దారుగా ఇక్బాల్

ప్రజాశక్తి - వాకాడు: తిరుపతి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తిరుపతి కలెక్టరేట్‌లో పిజిఆర్ఎస్ విభాగంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న సయ్యద్ ఇక్బాల్‌ను వాకాడు తహశీల్దారుగా అదనపు బాధ్యతలతో డిప్యూటేషన్‌పై నియమించారు. ఈ ఉత్తర్వుల మేరకు వాకాడు తహశీల్దారుగా శనివారం సయ్యద్ ఇక్బాల్ బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రజా సమస్యలపై దృష్టి సారిస్తూ, ప్రధానంగా భూ సమస్యలను తక్షణ పరిష్కారానికి చొరవ చూపిస్తానని తెలిపారు. డిప్యూటీ తహశీల్దార్ సయ్యద్ రఫీ, ఆర్ఐ అఖిల్, కార్యాలయ సిబ్బంది తాసీల్దార్‌ను ఘనంగా స్వాగతించి అభినందనలు తెలిపారు.

పరశురామేశ్వరుని సేవలో కలెక్టర్ వెంకటేశ్వర్

ప్రజాశక్తి -ఏర్పేడు: గుడిమల్లం పరశురామేశ్వరుని ఆలయానికి శనివారం తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఆయన సతీమణి స్వామి వారి దర్శనానికి విచ్చేశారు. వీరికి ఆలయ మర్యాదలతో మాజీ చైర్మన్ బత్తల గిరినాయుడు, కార్య నిర్వాహణ అధికారి రామచంద్రారెడ్డి స్వాగతం పలికి స్వామి, అమ్మవారి దర్శనం చేయించారు.

ముక్కంటి సేవలో న్యాయమూర్తులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పలువురు హైకోర్టు న్యాయమూర్తులు కుటుంబ సమేతంగా శనివారం శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేశారు. రాష్ట్ర హైకోర్టు జడ్జి వెంకట జ్యోతిర్మయి ప్రతాప, ఒరిస్సా హైకోర్టు జడ్జి మురహరి శ్రీరామన్‌లు వీరిలో ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు సాంప్రదాయ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. రాహు-కేతు సర్ప దోష నివారణ పూజలు చేసుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. తదనంతరం గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేద పండితులు ఆశీర్వచనాలు పలికి ముక్కంటి తీర్థప్రసాదాలు, జ్ఞాపికలు అందజేశారు. ఏ ఈ ఓ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సీఐ వెంకటరమణకు సన్మానం

ప్రజాశక్తి -కోట: ఎస్ఐ నుండి సీఐగా పదోన్నతి పొందిన వెంకట రమణను పలువురు అభిమానులు, అభిమానపూర్వకంగా కలిసి ఘనంగా పూలమాలలు వేసి అభినందనలు తెలియజేశారు. శనివారం సీఐ వెంకటరమణను నాయుడుపేట అంబేద్కర్ విగ్రహం వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐ అభిమానులు, పలువురు ఉద్యోగస్తులు, నాయకులు కర్షకులు రాంబాబు, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ బిల్లుల కౌంటర్లు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: విద్యుత్ బిల్లులు చెల్లింపుకు తిరుపతి నగరంలో వినియోగదారులు సెలవు దినం ఆదివారం కూడా కౌంటర్లు తెరిచి ఉంటాయని ఏపి ఎస్పీడిసిఎల్ టౌన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చిన్న కోటి చంద్ర శేఖర్ రావ్ తెలిపారు. కావున ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఉద్యోగ విరమణ చేసిన తహశీల్దారుకు సన్మానం

ప్రజాశక్తి - చిట్టమూరు: ఉద్యోగ విరమణ చేసిన చిట్టమూరు తహశీల్దార్ కాయల సతీష్ కుమార్‌ను గూడూరు సబ్ కలెక్టర్ మీనా సత్కరించారు. శనివారం ఆయన ఉద్యోగ విరమణ సందర్భంగా రెవెన్యూ సిబ్బందితో కలిసి సబ్ కలెక్టర్ ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మనోహర్ గౌడ్, గూడూరు, కోట తహశీల్దార్లు, కుటుంబ సభ్యులు, మండల రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

లేబర్ కమిషనర్ ఆఫీస్ ముట్టడిని జయప్రదం చేయండి : సీఐటీయూ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: సెప్టెంబర్ 15న నిర్వహించే విజయవాడలోని లేబర్ కమిషనర్ ఆఫీస్ ముట్టడిని జయప్రదం చేద్దామని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. తిరుపతి జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తిరుపతి పాత మున్సిపల్ ఆఫీస్ సెంటర్ వద్ద శనివారం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పి మునిరాజా మాట్లాడుతూ భవన నిర్మాణ సంక్షేమ బోర్డుకు రూ. 10 లక్షల పైబడిన నిర్మాణ సంస్థల నుండి, భవన యజమానుల నుండి ఒక శాతం సెస్సును వసూలు చేయబడుతుందని తెలిపారు. అలా వసూలు చేసిన డబ్బులు భవన నిర్మాణ కార్మికుల కార్డులకు, రిజిస్ట్రేషన్ ఫీజులు కలిపి నేటికీ దాదాపు 3 వేల కోట్ల రూపాయలున్నాయని తెలియజేశారు. గతంలో టీడీపీ ప్రభుత్వం ప్రచార ఆర్భాటాలకు వీరి అకౌంట్ నుండి 400 కోట్లు మళ్ళించాయాని ఆరోపించారు. ఒకటిన్నర కోట్ల మందికి లేబర్ ఇన్సూరెన్సులు, 131 కోట్లు చంద్రన్న బీమా, చలివేంద్ర నిర్వహణకు 450 కోట్లు మొత్తం 913 కోట్ల రూపాయలను మళ్లించారన్నారు. గతంలో వైసీపీ ప్రభుత్వం జీవో నెంబర్ 17 ద్వారా 450 కోట్లు వైయస్సార్ బీమా, కోసం 380 కోట్లు మొత్తం ఎనిమిది వందల కోట్లను మళ్లించారని, అంతటితో ఆగకుండా సర్కులర్ 1214 జారీ చేసి, క్లైములు నిలుపుదల చేశారని కొత్త క్లైములు నిరాకరించారన్నారు. కేంద్రం 29 చట్టాలను నాలుగు కోడ్లు గా మార్చేయడంతో, సంక్షేమ బోర్డు, కార్మికులు వేద అయిపోయిందన్నారు. వెంటనే ప్రభుత్వం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి కార్మికులను ఆదుకోవాలని కోరారు. తిరుపతి జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ అధికారంలోకి వస్తే భవన నిర్మాణ కార్మికుల ఆదుకుంటామని కూటమి నాయకులు హామీ ఇచ్చారని, సంవత్సరం దాటిన పట్టించుకోవడం లేదని, ఎన్నిసార్లు మొరపెట్టుకున్న ఖాతరు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనేకమార్లు ఎమ్మెల్యేలకు, ఎంపీలకు, కలెక్టర్లకు, లేబర్ అధికారులకు విన్నవించుకున్నప్పటికీ స్పందన లేదని, కనుక సెప్టెంబర్ 15వ తేదీన జరిగే లేబర్ కమిషనర్ ఆఫీస్ ముట్టడిని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు అనంతరం కరపత్రం విడుదల చేశారు. ఈ సమావేశంలో శ్రీరాములు,నారాయణస్వామి, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆస్తులు, భూముల పరిరక్షణకే స్వామిత్వ సర్వే

ప్రజాశక్తి - వాకాడు: మొలగనూరు పంచాయతీ పరిధి, ముమ్మారెడ్డిపాలెంలో శనివారం స్వామిత్వ రీసర్వే జరుగుతున్న తీరును మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాసులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రీసర్వేను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, పట్టాలేని వారి ఇళ్ళని పట్టా చేసుకోవాలని కోరారు. పట్టాలు పొందితే, బ్యాంకుల నుండి రుణాలు మంజూరు అవుతాయని తెలిపారు. రీసర్వే చేసి, ఒక స్మార్ట్ కార్డు రూపంలో ప్రాపర్టీని రిజిస్టర్ చేసి ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. పంచాయతీరాజ్‌కు సంబంధించిన ఆస్తుల పరిరక్షణకు, గ్రామ కంఠంలోని స్థలాలు మొత్తం కూడా స్వామిత్వ రీసర్వేలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎటువంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా సర్వే చేయాలని తెలిపారు. వాకాడు మండలంలో కొండూరు, మొలగనూరు, నిడిగుర్తి, రావిగుంటపాలెం, మూలపడవ గ్రామాలకు రీసర్వే కి అర్హత ఉన్నాయని నిర్ణీత సమయంలో సర్వే పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేష్, సర్వేయర్, ఇంజనీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

ఇంటర్ స్కూల్స్ ఫెస్ట్-2025 సమాచార పత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి వరదరాజనగర్, విశ్వం సైనిక్ నవోదయ పోటీ పరీక్షల కేంద్రంలో యూ.ఎస్.ఓ. ఇంటర్ స్కూల్స్ ఫెస్ట్-2025 సమాచార పత్రికను యూఎస్ఓ వైస్ ప్రెసిడెంట్ కే.వి.త్యాగరాజన్, విశ్వం విద్యా సంస్థల అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్ రెడ్డి చేతుల మీదుగా శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూఎస్ఓ వైస్ ప్రెసిడెంట్ మాట్లాడుతూ సెప్టెంబర్ 22న జీవకోనలోని విశ్వం హై స్కూల్ వేదికగా యునైటెడ్ స్కూల్స్ ఆర్గనైజేషన్ ఇంటర్ స్కూల్స్ ఫెస్ట్-2025 నిర్వహించబడనుందని, ఈ ఫెస్ట్‌కు రాష్ట్రంలోని 6 నుండి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు పాల్గొన వచ్చని తెలిపారు. చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు, జానపదనృత్యం, నాటక ప్రదర్శన,విజ్ఞాన ప్రదర్శన వంటి అంశాలపై పోటీలు ఉండనున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా విశ్వం విద్యా సంస్థల అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్ రెడ్డి మాట్లాడుతూ "యూ.ఎస్.ఓ. ఇంటర్ స్కూల్స్ ఫెస్ట్ విద్యార్థుల ప్రతిభను వెలుగులోకి తేవడంతో పాటు విజ్ఞానం, సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి గొప్ప వేదిక" అన్నారు. ఈ కార్యక్రమంలో యూఎస్ఓ సభ్యులు శ్రీనాథశర్మ, వెంకటరమణనాయుడు తదితరులు పాల్గొనారు. మరిన్ని వివరాలకు 8688888802 / 7093473533 ఫోన్ నంబర్లకు సంప్రదించగలరు.

సమగ్ర యాజమాన్య పద్ధతులతోనే రైతుకు ఆదాయం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : సమగ్ర యాజమాన్య పద్ధతితోనే రైతులకు ఆదాయమని, జిల్లా వరద కేంద్ర వ్యవసాయ అధికారి వేణుగోపాల్ పేర్కొన్నారు. పుత్తూరు డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకుల ఆధ్వర్యంలో శనివారం రైతు సేవా కేంద్ర సిబ్బందికి డివిజనల్ స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సమీకృత వ్యవసాయ పద్ధతులతో రైతుకు ఖర్చు తగ్గి, ఆదాయం పెరుగుతుందని, పర్యావరణానికి హితం చేకూరుతుందన్నారు. పుత్తూరు డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు లక్ష్మీదేవి మాట్లాడుతూ వ్యవసాయ శాఖలో అమలవుతున్న వివిధ పథకాలు, పంట నమోదు ప్రాముఖ్యత వివరించారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు డివిజన్ వ్యవసాయ అధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బంది, జిల్లా వనరుల కేంద్రం ఏఈఓ రవి ప్రసాద్ పాల్గొన్నారు.

ఐఐటిలో అర్బన్ ఫ్యూచర్స్.. ప్లానింగ్ అండ్ పాలసీ కనెక్ట్

ప్రజాశక్తి-ఏర్పేడు: ఐఐటీలో నీతిబోధ్ పాలసీక్లబ్ ఆధ్వర్యంలో విజయవాడ స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్‌ఆర్కిటెక్చర్ (ఎస్‌పిఏ)తో కలిసి శనివారం "అర్బన్ ఫ్యూచర్స్.. ప్లానింగ్ అండ్ పాలసీకనెక్ట్" కార్యక్రమం నిర్వహించారు. ప్రొఫెసర్ ఏకతతో పాటు 33 మంది ఎస్‌పిఏ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె సస్టెయినబుల్ అర్బన్ ప్లానింగ్ పై ప్రసంగం చేశారు. అనంతరం విద్యార్థులు తిరుపతి నగర భవిష్యత్ అభివృద్ధిపై తమ పరిశోధన వివరించారు. 2040 నాటికి మున్సిపల్ పరిధిలో అభివృద్ధి స్థలం తక్కువై అర్బన్ స్ప్రాల్ పెరిగే అవకాశం ఉందని వారు స్పష్టం చేశారు. తిరుపతి ఆర్థిక వ్యవస్థ ప్రధానంగా యాత్రిక, పర్యాటకంపై ఆధారపడి ఉందని, వ్యవసాయం, పరిశ్రమలు కూడా పాత్ర వహిస్తున్నాయన్నారు. ఈ విశ్లేషణలో శాటిలైట్ చిత్రాలు, ఆర్టిఫిషియల్ న్యూరల్ నెట్వర్క్స్, మెషిన్ లెర్నింగ్‌లను వినియోగించారు. ఐఐటీ ప్రొఫెసర్ డా.వరుణ్ వర్గీస్ ఢిల్లీ మెట్రో ఆధారంగా ఆటోమేటెడ్ ఫేర్ కలెక్షన్ ద్వారా రద్దీ కొలతలుపై ప్రసంగించగా, డా. అర్వింద్ పాండే మున్సిపల్ ఫైనాన్స్ సవాళ్లు, అవకాశాలు పైమాట్లాడారు. ఘన వ్యర్థాల నిర్వహణపై చర్చ జరిగింది. విద్యార్థులు పౌర సమాజం, సాంకేతిక వర్గం, ప్రభుత్వం, పర్యావరణ విధాన నిపుణులు, అర్బన్ ప్లానర్లు తరపున 5 గ్రూపులుగా విభ జించి పరిష్కారాలు సూచించారు.

నిమజ్జన వేడుకల్లో జాగ్రత్తలు తీసుకోండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: వినాయక విగ్రహాల నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని శ్రీకాళహస్తి రెండవ పట్టణ సీఐ నాగార్జునరెడ్డి సూచించారు. శనివారం ఆయన వినాయక కమిటీ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. గణపతి మండపాలకు విద్యుత్ తీగలను ఎవరూ అనవసరంగా ముట్టుకోకుండా చూసుకోవాలన్నారు. కవర్ లేని హాలోజన్, లాంపులను వాడవదన్నారు. రాత్రి సమయంలో ముగ్గురు వాలంటీర్లు మండపంలో నిద్రించాలన్నారు. వినాయక మండపాల వద్ద కొత్త వస్తువులు, బ్యాగులు, బ్రీఫ్‌కేసులు, బొమ్మల వస్తువలపై నిఘా ఉంచాలన్నారు. అందులో పేలుడు పదార్థాలు ఉండే అవకాశం ఉందని చెప్పారు. ప్రతిరోజు మండపాలను కమిటీ సభ్యులు సోదా చేసి ఏదైనా అనుమానిత వస్తువులు ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. భక్తులు తమ వెంట తెచ్చే లగేజీ, బ్యాగులను మండపాల వద్ద అనుమతించకూడదన్నారు. ఇక మండపాల వద్ద వాహనాలు పార్కింగ్ చేయకుండా చూసుకోవాల్సిన బాధ్యత నిర్వాహకులపై ఉందన్నారు. ఆదివారం నిర్వహించే నిమజ్జన వేడుకలను డీజేలు, బాణా సంచా లేకుండా తగు జాగ్రత్తలు తీసుకుని శాంతిభద్రతల సీసీ కెమెరాల పరిరక్షణల నడుమ ప్రశాంత వాతావరణంలో పూర్తిచేయాలని సూచించారు.

దక్షిణాది ప్రజల ఆదాయాన్ని దోచేస్తున్నారు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): దక్షిణాది రాష్ట్రాల ప్రజల కష్టాన్ని, ఆదాయాలను కేంద్ర ప్రభుత్వం ఉత్తరాది కార్పొరేట్లు అయిన అదానికి, అంబానీకి దోచిపెడుతున్నారని, ఇకనైనా దక్షిణ భారతదేశ మేధావులు మేల్కొని సంఘటిత పోరాటానికి సిద్ధం కావాలని శ్రీకాళహస్తి మాజీ ట్రస్టు బోర్డు మెంబర్ జంగాలపల్లి అన్నపూర్ణమ్మ పిలుపునిచ్చారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. డి లిమిటేషన్ జరిగితే పార్లమెంటులో మన ఎంపీల శాతం తగ్గి అక్కడినుండి మెడబట్టి బయటకు గెంటే పరిస్థితులు రానున్నాయన్నారు. భాషా వివాదాలను సష్టించి దేశ భాషలందు తెలుగు లెస్స అని పలికిన మనం త్రిభాషా విధానాన్ని బలవంతంగా అవలంబిస్తూ మన దేశంలో హిందీలో పరీక్షలు పెడుతూ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో సైతం ఉత్తర భారత దేశస్తులకే దక్కేలా ఉన్న ఈ పరిస్థితులు చక్కబడాలన్నారు. దేశం మొత్తం పన్నుల వాటాలో దక్షిణాది రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతూ ఉత్తరాది వారికి మాత్రం కేటాయింపుల్లో అగ్రస్థానం ఇస్తున్నారన్నారు. దీనివలన రాబోయే రోజుల్లో దక్షిణాది రాష్ట్రాలు ఆర్థికంగా మరింతగా క్షీణించి పోయే పరిస్థితులు వస్తాయన్నారు. ఇప్పటికైనా దక్షిణ భారతదేశ మేధావులు మేల్కొని మౌనం వీడి ప్రజల్లోకి రావాలని కోరుతున్నామన్నారు. తమ బిడ్డల భవిష్యత్తు అగమ్య గోచరంగా మారకముందే సంఘటితం కావాలన్నారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త జంగాలపల్లి సుభాకర రెడ్డి పాల్గొన్నారు.

అక్రమ సస్పెన్షన్ రద్దు చేయాలని దీక్షలు

ప్రజాశక్తి - సూళ్లూరుపేట: మహిళా కండక్టర్ అక్రమ సస్పెన్షన్‌ను రద్దు చేయాలంటూ సూళ్లూరుపేట డిపోలో రెండో రోజూ శనివారం రిలేదీక్షలు కొనసాగాయి. ఆర్టీసీలో 1/19 సర్క్యులర్ అమలు చేసేందుకు మంత్రి మండిపల్లిరామ్‌ప్రసాద్‌రెడ్డి ఆదేశాలు ఇచ్చారని, అయితే సూళ్లూరుపేట డిపో అధికారులు మాత్రం విరుద్ధంగా వ్యవహరిస్తున్నారన్నారు. సర్క్యులర్‌ను ఉల్లంఘించి, వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా ఓ మహిళా కండక్టర్ రిక్వెస్ట్ స్టేజిలో టికెట్లు కొడుతూ ఉండగా రూ.30 అవినీతి జరిగిందని సస్పెండ్ చేశారన్నారు. అక్రమ సస్పెన్షన్‌ను ఖండిస్తూ నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో దీక్ష చేపట్టారు. రెండో రోజు దీక్షకు మద్దతుగా సుబ్రమణ్యం, జగదీష్, శంకరయ్య, హరీష్, అశోక్, రామచంద్రయ్య, మూర్తి, గ్యారేజి సెక్రటరీ కల్యాన్ కృష్ణ పాల్గొన్నారు.

చంద్రగిరిలో స్త్రీ శక్తి విజయోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి): మహిళల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పేర్కొన్నారు. శనివారం చంద్రగిరిలో స్త్రీ శక్తి విజయోత్సవ సభ, ర్యాలీ విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం విజయవంతంగా అమలు చేసిందన్నారు. అందరికీ అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరించి, నియోజకవర్గాన్ని అభివృద్ధికి కృషి చేస్తున్నానన్నారు. టిడిపి మహిళా నేత పులివర్తి సుధా రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి మహిళకు తోడుగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, గాలి పుష్పలత, ఈశ్వర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ గౌస్ బాషా, సిడిఎంఎస్ చైర్మన్ సుబ్రహ్మణ్యం నాయుడు, రమేష్ రెడ్డి, జడ్పిటిసి నంగా పద్మజా రెడ్డి, సురేష్ నాయుడు, అల్మినేని మధు, వైకుంతం శ్రీధర్ నాయుడు, పార్టీ అధ్యక్షులు, ఎం తిరుమలరెడ్డి, ఏ బాలకృష్ణ, నాగరాజు నాయుడు, బెల్లంకొండ మురళి కూటమి పార్టీల నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించండి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : హాస్పిటల్‌కి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, డయాలసిస్ వార్డులో ఏసీలు మొరాయిస్తున్నాయని తెలియజేశారని ఈ సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ తెలిపారు. గూడూరు, ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌లో శనివారం హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, కమిటీ సభ్యులు హాజరయ్యారు. హాస్పిటల్లోని పలు సమస్యలపై చర్చించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సమావేశంలో పలు తీర్మానాలు చేయడం జరిగిందని, కలెక్టర్ నిధులతో హాస్పిటల్ ప్రహరీ గోడ నిర్మించినట్లు తెలిపారు. అదనపు టాయిలెట్ బ్లాక్‌కు ప్రతిపాదనలు పంపిస్తున్నామని తెలిపారు. సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా మాట్లాడుతూ సమావేశంలో చర్చకు వచ్చిన సమస్యలను ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో హాస్పిటల్స్ సూపరింటెండెంట్ షరీనా, కిరణ్ కుమార్, బిల్లు చెంచురామయ్య, భారతి, డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పిహెచ్‌సి ఆసుపత్రి ల్యాబ్ నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నగరి నియోజకవర్గం, నింద్ర మండలంలోని పిహెచ్‌సిలో, ల్యాబ్ నిర్మాణానికి రూ.50 లక్షల అంచనాతో నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ శనివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భవన నిర్మాణంలో నాణ్యత పాటించాలని, త్వరగా పనులు పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: సాగు యాజమాన్యాల్లో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు చేకూరే పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని రాస్ కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త శ్రీరామ్ కుమార్ అన్నారు. ఏపీసీడ్స్ లోని సమావేశపు హాలులో శుక్రవారం డివిజన్ స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. రానున్న రబీ సీజన్‌కు ఇప్పటి నుంచే ప్రణాళిక బద్ధంగా రైతులను చైతన్యవంతులను చేయాలని కోరారు. సమీకృత వ్యవసాయ పద్ధతులను అమలు దిశగా రైతులను ప్రోత్సహించడం ద్వారా ఖర్చు తగ్గించి ఆదాయాన్ని పెంచుకోవచ్చునీ, తద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమయ్యే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీఏ రమేష్ రెడ్డి, వేణుగోపాల్, ఏఈవో రవిప్రసాద్, డివిజన్ స్థాయి వ్యవసాయాధికారులు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

లక్కీ డిప్ ద్వారా బార్ల కేటాయింపు

లక్కీ డిప్‌లో టోకెన్ నెంబర్ కాయిన్ చూపుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి జిల్లాలో నూతన బార్ పాలసీ ద్వారా ఓపెన్ క్యాటగిరి లోని 26 బార్లకు లక్కీ డిప్ ద్వారా జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ శనివారం జిల్లా కలెక్టరేట్లో కేటాయింపులు చేశారు. 2025-28 బార్ పాలసీ తిరుపతి జిల్లాలో మొత్తం 32 బార్లకు సంబంధించి 29 ఓపెన్ కేటగిరి బార్లు, మూడు గీతకులాల కోసం రిజర్వు చేయ బడిందని అధికారులు తెలిపారు. శనివారం నిర్వహించిన లక్కీ డిప్‌లో పాత లైసెన్స్ దారులు, నూతన ఔత్సాహికులు మొత్తం కలిపి 173 మంది ఓపెన్ క్యాటగిరిలోని 29 షాపులకు దరఖాస్తులు చేసుకున్నారు. గీత కులాలకు సంబంధించి 36 మంది దరఖాస్తులు చేసుకున్నారని మొత్తం 210 మంది దరఖాస్తులు చేసుకుని లక్కీ డిప్ కార్యక్రమంలో పాల్గొన్నట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి కె. నాగమల్లేశ్వర్ రెడ్డి తెలిపారు. ఇందులో 32 బార్లలో 26 బార్లకు లక్కీ డ్రా ద్వారా బార్లను కేటాయించడం జరిగిందని మిగిలిన ఆరు బార్లకు త్వరలో నోటిఫికేషన్ జారీ చేస్తామని తెలిపారు. బార్ల లైసెన్సుల కోసం దరఖాస్తుల ఫీజులు, ప్రాసెసింగ్ ఫీజులు, రిటైల్ ఎక్సైజ్ టాక్స్ ఈ ప్రక్రియల ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు రూ.12, 95, 58, 415/- కోట్ల రూపాయలు సమకూరిందని అధికారులు ప్రకటించారు.

వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: ఓటర్ల జాబితాలో నమోదు, తొలగింపు చేపట్టేందుకు జిల్లా రెవిన్యూ అధికారి నరసింహులు శనివారం వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో రాజకీయ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు. హాజరైన వారిలో పి.సుధారాణి, తెలుగు దేశం పార్టీ, తిరుపతి, టి.డి.వర ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి, బిజెపి, నాగార్జు, జిల్లా కార్యదర్శి, సి.పి.ఐ.(ఎం), కలిందర్, డిసిసి ప్రధాన కార్యదర్శి, భారత జాతీయ కాంగ్రెస్, చంద్ర మోహన్ రెడ్డి, వైసీపీ జిల్లా పార్టీ ఇంచార్జ్, నీరుగట్టు నగేష్, తిరుపతి జిల్లా అధ్యక్షుడు, ఆమ్ ఆద్మీ పార్టీలు ఉన్నారు. ఈ సమావేశంలో అభ్యంతరాల వివరాలు, వాటి పరిష్కారం గురించి పార్టీ ప్రతినిధులకు వివరించారు. పోలింగ్ స్టేషన్ హేతుబద్ధీకరణ సమస్యలు, సూచనలను తెలియజేశారు. ఈ సందర్భంగా పార్టీల ప్రతినిధులు పోలింగ్ కేంద్రంలో బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించాలని కోరారు. సుధా రెడ్డి, చంద్రగిరి నియోజకవర్గానికి సంబంధించి పోలింగ్ కేంద్రాల సంఖ్య ఎక్కువ ఉన్నదని వాటిలో ఓటర్లు ఎక్కువ ఉన్న పోలింగ్ కేంద్రాలను సర్దుబాటు చేయాలని కోరారు. ఒకే కుటుంబానికి సంబంధించిన ఓటర్లు ఒకే పోలింగ్ కేంద్రాలకు ఉండవలసినగా కోరారు. డి కలిందర్ ఇండియన్ నేషనల్ కాంగ్రెస్, పోలింగ్ సమయంలో పోలింగ్ ఏజెంట్ల వివరాలను కోరారు.

కమాండ్ కంట్రోల్ పనులు పూర్తవ్వాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ :నవంబర్ నెలలోపు ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ పనులను పూర్తిస్థాయిలో అందుబాటులోనికి తీసుకురావాలని స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. తిరుపతి స్మార్ట్ సిటీ మిషన్ ద్వారా చేపట్టిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ పనుల పురోగతిపై శనివారం మేనేజింగ్ డైరెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని అన్ని ప్రధాన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అన్నారు. సెప్టెంబర్ చివరిలోపు తాత్కాలిక కమాండ్ కంట్రోల్ సెంటర్ పనులు పూర్తి కావాలని సంబంధిత ఏజెన్సీ అధికారులను ఆదేశించారు. అక్టోబర్ రెండవ వారంలో గో లైవ్ ప్రారంభం కావాలని, నవంబర్ నెలాఖరుకు అన్ని పనులు పూర్తి చేసి, అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించినారు. ఈ సమీక్షా సమావేశం సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, ఈ.ఈ. రవి, డి.ఈ. రాజు పాల్గొన్నారు.

చెత్త నిర్వహణపై మైకుల్లో ప్రచారం

తడి,పొడి చెత్త వేర్వేరుగా ఇవ్వడం వల్ల కలిగే ప్రయోజనాలు, నగర పాలక సంస్థ చేపడుతున్న కార్యక్రమాలపై ప్రజలకు చెత్త తరలించే వాహనాల్లో మైకుల ద్వారా అవగాహన కల్పించాలని కమిషనర్ ఎన్.మౌర్య ఆదేశించారు. నగరంలో ఎక్కడా చెత్తకుప్పలు లేకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మున్సిపల్ ఇంజినీర్ గోమతి పాల్గొన్నారు.

క్రైం న్యూస్

అదృశ్యమైన బాలిక అప్పగింత

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు రెండో పట్టణ పరిధిలోని నాయి బ్రాహ్మణ ప్రాంతానికి చెందిన ఓ మైనర్ బాలిక తప్పి పోవడంతో కుటుంబసభ్యులు గూడూరు రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ శ్రీనివాస్ అధ్వర్యంలో బృందాలుగా ఏర్పడి బాలిక ఆచూకీని గుర్తించి కుటుంబసభ్యులకు అప్పగించారు. బాలికకు ఆరోగ్యం బాగాలేదని, ఇంట్లో వాళ్ళు మందలించడంతో వెళ్లి పోయిందని తెలిపారు. బాలిక కుటుంబ సభ్యులు పోలీస్‌లకు ధన్యవాదాలు తెలిపారు.

తహశీల్దార్ కార్యాలయంలో పాము కలకలం

ప్రజాశక్తి - నాయుడుపేట: తిరుపతి జిల్లా, నాయుడుపేట మండలం రెవెన్యూ కార్యాలయంలోకి నాగుపాము వచ్చి సిబ్బందిని భయాం దోళనకు గురిచేసింది. శనివారం ఉదయం కార్యాలయంలోకి సిబ్బంది విధులనిమిత్తం వస్తూ ఉన్న సమయంలో నాగుపాము కార్యాలయంలోని వీఆర్వోల గదిలోకి దూరింది. సిబ్బంది, ఇతర సమస్యలపై కార్యాలయానికి వచ్చిన ప్రజలు పామును చూచి భయంతో కేకలు వేశారు. వెంటనే తేరుకున్న సిబ్బంది మున్సిపల్ కార్మికులను పిలవడంతో వారు వచ్చి పామును కొట్టి చంపేశారు. రెవెన్యూ కార్యాలయం పక్కనే రైల్వే ట్రాక్, చుట్టూ చెట్లు, మరుగుతో నిండి ఉండడంతో పాము ఆపొదల్లోనుంచి వచ్చి ఉండవచ్చని కార్యాలయ సిబ్బంది అనుమానం వ్యక్తంచేశారు.

టీటీడీ ఉద్యోగి అనుమానాస్పద మృతి

మృతి చెందిన కోనేటి సుబ్బరాజు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: టీటీడీ ఉద్యోగి అనుమానస్పద స్థితిలో మృతి చెందిన ఘటన తిరుపతిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు కపిలతీర్థంలో టీటీడీ ఏఈఓగా పనిచేస్తున్న కోనేటి సుబ్బరాజు, ప్రముఖ కళాకారుడుగా సుపరిచితుడు. ఆయన అనారోగ్య కారణాలతో శుక్రవారం రాత్రి మృతి చెందిన ఘటన పలు అనుమానాలు తావిస్తోంది. రంగస్థలం నటుడు సుబ్బరాజు ఆగస్టు 31న పదవీ విరమణ చేయునున్నారు. రంగస్థల నటుడు సుబ్బరాజు, పదవి విరమణకు రెండు రోజులకు ముందు మృతి చెందడం బాధాకరం. మృతుడి భార్య కోనేటి వెంకట సరస్వతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని రుయాకు తరలించి, శనివారం రూయ ఆసుపత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. మృతికి గల కారణాలు పోస్ట్ మార్టం నివేదిక ఆధారంగా తేలనున్నట్లు అలిపిరి పోలీసులు వెల్లడించారు.

వీఆర్వో, సర్వేయర్లు పనితీరు మార్చుకోవాలి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: గ్రామరెవెన్యూ అధికారులు, గ్రామ సచివాలయ సర్వేయర్ల పనితీరు బాగోలేదని, వారు పనితీరు మార్చుకోక పోతే చర్యలు తప్పవని తహశీల్దారు శ్రీదేవి హెచ్చరించారు. శనివారం ఆమె తన కార్యాలయంలో వీఆర్ఓలు, సర్వేయర్లు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రీవెన్స్ డే రోజున నిర్వహించే ప్రజా సమస్యల ప్రజావేదిక కార్యక్రమంలో వచ్చిన వినతులను పరిష్కరించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కా రానికి కృషిచేయాలని తెలిపారు. కార్యాలయానికి వచ్చే ప్రజలకు సరైన సమాధానాలు చెప్పకపోవడం, వారిని ఒకటికి పది సార్లు ఆఫీసుల చుట్టూ తిప్పడం లాంటివి తన దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ చేసిన మణిశంకర్‌కు సన్మానం

ప్రజాశక్తి - పుత్తూరు : విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసిన మున్సిపల్ మేనేజర్ మణిశంకర్ సేవలు అభినందనీయమని కమిషనర్ ఎం.మంజునాథ్ గౌడ్ కొనియాడారు. శనివారం మణిశంకర్ ఉద్యోగ విరమణ సందర్భంగా ఆయనను మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. సమాచార హక్కుల వేదిక కార్యదర్శి మురగారెడ్డి మాట్లాడుతూ మణిశంకర్ నిబద్ధతతో పనిచేస్తూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు పబ్లిక్ అండ్ హెల్త్ ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, రిటైర్డ్ మున్సిపల్ కమిషనర్ చంద్రప్రకాష్, ఎఈ కార్తికేయన్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో నూతన పీఏసీ-5 భవనం పరిశీలన

ప్రజాశక్తి - తిరుమల: తిరుమలలో నూతనంగా నిర్మించిన యాత్రికుల వసతి సముదాయం-5ను టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరితో కలిసి శనివారం పరిశీలించారు. భవనంలోని హాళ్లు, కళ్యాణ కట్ట, మరుగుదొడ్లు, అన్న ప్రసాద వితరణ కేంద్రాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా అన్ని సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. అనంతరం చైర్మన్ మీడియాతో మాట్లాడుతూ ఇంజనీరింగ్ అధికారులు అద్భుతంగా ఈ సముదాయాన్ని నిర్మించారని అభినందించారు. 2018లో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో బోర్డు ఆమోదం తెలిపిన ఈ ప్రాజెక్టు ద్వారా తిరుమలలో యాత్రికుల వసతి సమస్యకు కొంత మేర ఉపశమనం కలుగుతుందని తెలిపారు. ప్రస్తుతం తిరుమలలో 45 వేలమందికి మాత్రమే వసతి సౌకర్యాలు ఉన్నాయని, కొత్తగా నిర్మించిన పీఏసీ-5లో 2,500 మంది యాత్రికులు సులభంగా వసతి పొందగలరని వివరించారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.రానున్న బ్రహ్మోత్సవాల సమయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఈ సముదాయాన్ని భక్తులకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీటీడీ సీఈ సత్య నారాయణ, ఈఈలు వేణు గోపాల్, శ్రీనివాస రావు, సుధాకర్, డిప్యూటీ ఈవోలు రాజేంద్ర, సోమన్నారాయణ, డీఈ చంద్రశేఖర్, వీజీవో సురేంద్ర పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థీ హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి -కోట : ప్రతి విద్యార్థి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తహశీల్దార్ కటారి జయ జయ రావు పేర్కొన్నారు. శనివారం కోట మండలం, సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక తహశీల్దార్ హాజరయ్యారు. ఆయన విద్యార్థినులతో మాట్లాడుతూ దైనందిక జీవి తంలో చట్టాలపై అవగాహన కలిగి నడుచుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ మల్లి కార్జునరావు, వ్యవసాయ అధికారి సుచేంద్రా ప్రసాద్, సిడిపిఓ ముని కుమారి, సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం వార్డెన్ టి.ఉషారాణి, అంగన్వాడి సూపర్వైజర్ కృష్ణమ్మ, ఇరిగేషన్ వర్క్ ఇన్స్పెక్టర్ అబ్దుల్లా, చిట్టేడు వైద్యాధికారి నాగరాజు, హాస్టల్ విద్యార్థినిలు పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE : PRODDATUR

O.S.No. 188/2023

Hanumandla Narayana, aged about 52 years, son of Sai Baba, Hindu, Business, residing at D.No. 12/659, Rajabata Street, Proddatur Town, Kadapa District. ...Plaintiff

Vs

Sinisetla Bala Venkata Karthik, 48 aged about years, son of Rambabu @ Ramesh, Hindu, Business, residing at D.No.10-3-581, Reddy & Reddy Colony, Tirupati Town, Chittore District. ...Defendant

దావా సమను

ఈ నెంబరు దావాలోని ప్రతివాది అయిన నీ పైన వాది ప్రామిసరి నోటులు నిమిత్తం బాకీ రాకోరి పై కోర్టు యందు దావా దాఖలు చేసి ఉన్నారు. అట్టి దావాలో ప్రతివాది అయిన నీకు 15.09.2025 నాడు వాయిదా ఉంటుఉన్నది. అట్టి తేదీ నాడు ఉదయం గం॥10.30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరై ఆక్షేపణలు తెల్పుకోవలసినది. లేనంతట నీ పరోక్షమందు తీర్మానించబడును.

వాయిదా తేది: 15.09.2025

//By Order of the Court//

పి. చంద్రశేఖర్,
అడ్వకేట్, ప్రొద్దుటూరు.
కడప జిల్లా. సెల్: 9866635497.

చవితి వేడుకల్లో భక్తులకు అన్నదానం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: వినాయక చవితి వేడుకల్లో భాగంగా నాలుగవ రోజు శనివారం రైల్వే స్టేషన్ వద్దనున్న బి.ఆర్ అంబేద్కర్ తల్లి దీవెన ఆటో స్టాండ్ వద్ద సుమారు 1000 మంది భక్తులకు అన్నప్రసాదాలు వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆటో స్టాండ్ అధ్యక్షుడు బాలకృష్ణ మాట్లాడుతూ ఆధ్యాత్మిక తిరుపతి నగరంలో భక్తి భావాన్ని పెంచాలని సంకల్పంతో ప్రస్తుతం ఆటో స్టాండ్ వద్ద గతంలో అనేక అవరోధాలు ఎదుర్కొని వినాయక గుడిని నిర్మించడం జరిగిందన్నారు. 2005లో ఆటో స్టాండ్ ప్రారంభించి అనేక సామాజిక కార్యక్రమాలతో చేయూతనందిస్తున్నామన్నారు. స్వామివారి దర్శనానికి విచ్చేసి యాత్రికులకు తమ వంతు సాయం అందిస్తూ భక్తులచే ప్రశంసలందుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. అంతేకాక నగరంలో అనాథ శవాలకు దనక్రియలను ఆటో స్టాండ్ సభ్యుల సహకారంతో తమ సొంత ఖర్చులతో చేపడుతున్నట్లు తెలిపారు. తిరుపతి నుంచి వినాయక విగ్రహాన్ని ఊరేగింపుగా వాకాడు వద్దనున్న తూకులపాలెం వద్దకు తీసుకెళ్లి అక్కడ భక్తిశ్రద్ధలతో గణపయ్య నిమజ్జనం చేపడుతామని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా ఎడిపి విద్యాసంస్థల అధినేత ప్రణీత్ ముఖ్య అతిథిగా హాజరు కారున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆటో స్టాండ్ కార్యదర్శి జగదీష్, సహాయ కార్యదర్శి విగ్నేష్, రాజగోపాల్, భాస్కర్, సభ్యులు పాల్గొన్నారు.

శ్రీసిటీలో అలరించిన వీణావాదన

ప్రజాశక్తి - వరదయ్యపాలెం: శ్రీసిటీ ఆధ్యాత్మిక, సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో శనివారం శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో పూజా కార్యక్రమాల అనంతరం భక్తిరసభరిత వీణా వాద్య కచేరి భక్తులను ఎంతగానో అలరించింది. ఆహ్లాదకరమైన ప్రకృతి ఒడిలో యువ కళాకారిణి వాకచర్ల సుష్మా తమ వీణా వాదనతో ఆలయ వాతావరణాన్ని ఆధ్యాత్మికానందంతో నింపింది. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సుష్మను అభినందించారు. శ్రీవాణి వేదికగా స్థానిక యువ కళాకారుల ప్రతిభను ప్రోత్సహిస్తూ ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తుండడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

ఎయిడ్స్‌పై అవగాహన

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాలతో గ్రామోద్యమ సమితి ఆధ్వర్యంలో హెచ్ఐవి, ఎయిడ్స్ పై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సాయి నగర్ పంచాయతీ సచివాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ మాధవి మాట్లాడుతూ హెచ్ఐవి ఎయిడ్స్ ప్రమాద తీవ్రతను, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ డీవీ రమణ, మౌనిక, నీరజ, గాయత్రి, సిబ్బంది పాల్గొన్నారు.

డిఎల్‌డివో కార్యాలయ ఏర్పాటు పనుల పరిశీలన

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, డిఎల్‌డివో కార్యాలయ ఏర్పాటు పనులను జిల్లా ప్రజా పరిషత్ అధ్యక్షులు ఆనం అరుణమ్మ తనిఖీ చేశారు. ఈ సందర్భముగా ఆమె మాట్లాడుతూ ఆక్టోబరులోగా డిఎల్‌డివో కార్యాలయాలు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గూడూరు జెడ్‌పిటిసి సభ్యులు, జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి మోహన్ రావు, గూడూరు డిఎల్‌డివో వాణి, గూడూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి మధుసూదన్ రావు తదితరులు పాల్గొన్నారు.

తిరుప్పావై ఉపన్యాసాల నిర్వహణకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ :పవిత్రమైన ధనుర్మాసంలో 2025 డిసెంబరు 16 నుంచి 2026 జనవరి 14వ తేదీ వరకు దేశంలోని వివిధ ప్రాంతాల్లో తిరుప్పావై ఉపన్యాసాలు చేసేందుకు సమర్థులైన శ్రీవైష్ణవ సిద్ధాంతం తెలిసిన పండితుల నుంచి దరఖాస్తులు, అంగీకార పత్రాలను టిటిడి ఆహ్వానిస్తోందని అధికారులు తెలిపారు. అర్హులైనవారు సెప్టెంబరు 1 నుండి 30వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు "ప్రత్యేకాధికారి, ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు, శ్వేత భవనం, టిటిడి, తిరుపతి" అనే చిరునామాకు దరఖాస్తులు, అంగీకార పత్రాలు పంపాలని కోరారు. టిటిడి ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ప్రతి ఏటా ధనుర్మాసంలో దేశంలోని వివిధ ప్రాంతాల్లో తిరుప్పావై ఉపన్యాసాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.అంగీకార పత్రాలు ఇచ్చే పండితుల పట్టికతోపాటు, షరతులు, దరఖాస్తులను వెబ్‌సైట్ నుంచి పొందొచ్చని తెలిపారు.

జూనియర్ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవం

ప్రజాశక్తి - క్యాంపస్ :

శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో గిడుగు రామమూర్తి జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవం పురస్కరించుకుని కళాశాల అధ్యక్షులు డా.సి.భువనేశ్వరి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యక్షులు మాట్లాడుతూ గ్రాంధికంలో ఉన్న భాషను ప్రజలు మాట్లాడే వ్యవహారిక భాషలోకి తీసుకొచ్చిన మహనీయుడు గిడుగు అని కొనియాడారు. ఆయన కృషి వల్లే తెలుగు గ్రాంధిక భాషా బంధనాల నుండి బయటపడి ప్రజలు మాట్లాడే మాట, పుస్తకాల్లో సాహిత్యంలో స్థానం సంపాదించుకుందని అందువల్లనే మన భాష మరింత సజీవ భాషగా మారిందని, ప్రతి సామాన్యుడు చదువుకు దగ్గరయ్యాడని అన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసినటువంటి డాక్టర్ తేజోవాణి మాట్లాడుతూ ఆనాడు సాధారణ ప్రజలు విద్యకు దూరంగా ఉండేవారని ఇలాంటి సమయంలోనే ఒక మహనీయుడు ముందుకు వచ్చాడని, గిడుగు రామమూర్తి పంతులు ప్రజల మాటే అసలు తెలుగు అందరికీ అర్థం అయ్యే వ్యవహారికమే జీవభాష ఆలోచనలు సాహిత్యాన్ని విద్యను సమాజాన్ని మార్చేశాయని అన్నారు. ఆయన కృషి వల్లే పల్లెల్లో పట్టణాల్లో పాఠశాలల్లో వ్యవహారిక తెలుగు స్థానం సంపాదించుకున్నదని, ఆయన రచనలు భాషను మాత్రమే కాదు సమాజాన్ని కూడా మేల్కొలిపాయని తెలుగు బాషా గురించి క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల తెలుగు అధ్యాపకులు జయమ్మ, కల్పన, మునేంద్ర, ధనమ్మ, హాస్టల్ వార్డెన్ డా. స్నేహలత, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

డీఎస్పీ చేతుల మీదుగా అన్నదానం ప్రారంభం

ప్రజాశక్తి - రేణిగుంట : రేణిగుంట జి.ఎం స్ట్రీట్‌లో శ్రీ అభయ వినాయక అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న వినాయక చవితి మహోత్సవాలలో భాగంగా నాలుగవ రోజు శనివారం మధ్యాహ్నం అభయ వినాయక అసోసియేషన్, బీడీ బాలాజీ సంయుక్త ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. డిఎస్పి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి డీఎస్పీకి ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో వన్నె కుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ చిన్నారెడ్డి,భాస్కర్ యాదవ్,కొరియర్ రవి,కన్నా రెడ్డి,పుమణి,ఇండియన్ బ్యాంక్ మేనేజర్ సుమంత్,శ్రీ అభయ వినాయక అసోసియేషన్ సభ్యులు లక్ష్మణ్, జూలియన్ రాజు,సుమన్, పవన్,కళ్యాణ్ ప్రభు, ధనుంజయ,వినోద్,నితిన్,దినేష్,సుబ్బు,హేమాద్రి,ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

గణనాథుడికి ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, ఐసిఎస్ రోడ్డులో జరుగుతున్న వినాయక చవితి ఉత్సవాల్లో శనివారం ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ పాల్గొని గణనాథుడికి పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం రాణి పేటలో ఏర్పాటుచేసిన గణనాథుడు విగ్రహం వద్ద ఎమ్మెల్యే పూజలు నిర్వహించారు. కమిటీ సభ్యులు ఎమ్మెల్యేని ఘనంగా సన్మానించారు.

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని ఎం.ఎస్.ఎం.నగర్

గణేష్ మండపంలో శనివారం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి సన్నిధిలో ఉదయం నాగలక్ష్మి వారి కుటుంబ సభ్యులతో స్వామి వారికి మహా లడ్డు ప్రసాదం సమర్పించారు. మధ్యాహ్నం భువనేశ్వరి, కరుణాకర్ వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

బాల్యవివాహాలపై అవగాహన

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో తహశీల్దార్ శ్రీదేవి, సబ్ ఇన్స్పెక్టర్ విశ్వనాథ నాయుడు మండలంలోని కాసులపెళ్లూరు, ఎస్టీ కాలనీలో శనివారం బాల్యవివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలతో ఎదురయ్యే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకుడు భాస్కర్ యాదవ్, వీఆర్వోలు వెంకటేష్, తేజ రెడ్డి, బాలికల వసతి గృహ అధికారిణి సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కార్యక్రమం

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండల పరిధిలోని వ్యవసాయ కార్యాలయంలో శనివారం ఉదయం వ్యవసాయ అధికారి షణ్ముగం వ్యవసాయ సహాయకులకు, ఉద్యాన సహాయకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో రైతులకు ఏవైనా మెలకువలు, సలహాలు కావలసి వస్తే వ్యవసాయ సహాయకులకు, అధికారులకు తెలియజేయాలని తెలిపారు. పంట మీద అవగాహన కల్పించి, ఏ సీజన్లో ఏ మందులు వాడాలి, ఎన్ని రోజులకు పిచికారీలు చేయాలి అనే విషయాలపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వ్యవసాయ రైతులు, ఉపాధి హామీ ఏవో దేవర, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.